సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

IIలో ▸



నేటి నుంచి నిజరూప దర్శనం

త్రిలింగ క్షేత్రం నత్తారామేశ్వరంలో గోస్తనీ గర్భంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరుడు భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నారు.

IIలో ▸

ఆశలన్నీ అక్షయ తృతీయపైనే

అక్షయ తృతీయ బంగారం అమ్మకాలపై వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. అమ్మకాలు జోరందుకుంటాయని ఆశిస్తున్నారు.

IIలో



న్యూస్‌రీల్

త్యాగానికి ప్రతీక రంజాన్



పి.ప్రశాంతి, కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యానికి, సోదరభావానికి ప్రతీక రంజాన్ అని, ముస్లింలు ఆనందంగా పండుగ జరుపుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

'చూడ చక్కని చిత్రం'కు పురస్కారం



షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరిస్తున్న అడబాల లక్ష్మీనారాయణ

వీరవాసరం: రాయకుదురుకి చెందిన లఘు చిత్రాల దర్శకుడు, శ్రీ కృష్ణ దేవరాయ నాటక కళ పరిషత్తు ప్రధాన కార్యదర్శి అడబాల లక్ష్మీనారాయణ దర్శకత్వంలో అడబాల రామకృష్ణుడు నిర్మాతగా నిర్మించిన 'చూడ చక్కని చిత్రం' షార్ట్‌ఫిల్మ్‌కు దాసరి ఫిల్మ్ అవార్డు వచ్చింది. శత చిత్ర దర్శకుడు దాసరి నారాయణరావు పేరున అవార్డు ప్రదానం చేయనున్నారు. లక్ష్మీనారాయణ ఇప్పటికే పలు అవార్డులు, ప్రశంసలు పొందారు. వచ్చేనెల 1న హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో సినీ గ్రామికుల సమక్షంలో అవార్డు అందుకోనున్నారు. లక్ష్మీనారాయణను సర్పంచ్ గెడ్డం భారతి, శ్రీకృష్ణ దేవరాయ నాటక పరిషత్ అధ్యక్షుడు గోపాలకృష్ణ, అడబాల బాబి, తోట బుజ్జి తదితరులు అభినందించారు.

జిల్లా చీఫ్ కోచ్‌గా రమేష్

సాక్షి, భీమవరం: జిల్లా క్రీడల చీఫ్ కోచ్‌గా రమేష్ నియమితులయ్యారు. ఆయన ఏలూరు వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌గా పనిచేస్తూ బదిలీపై భీమవరం రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన పి.సురేంద్రబాబు విజయవాడలోని క్రీడల శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు.

శాస్త్రవేత్తల పాత్ర స్ఫూర్తిదాయకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: విజ్ఞానభారతి రూపొందించిన ఇండియన్ సైంటిస్ట్స్ ఇన్ ఫ్రీడం మూవ్‌మెంట్ తెలుగు అనువాదం పుస్తకాన్ని శుక్రవారం భీమవరంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ నాయకులతో పాటు పలువురు శాస్త్రవేత్తలు తమ వంతు పాత్ర పోషించారన్నారు. ఆయా శాస్త్రవేత్తల త్యాగం, కృషి, పోరాట ఘట్టాలను వివరించేలా పుస్తకాన్ని రూపొందించారన్నారు. భారతీయ విజ్ఞాన మండలి జిల్లా అధ్యక్షుడు వై.రవీంద్ర పాల్గొన్నారు.

తణుకులో జాతీయస్థాయి సదస్సు

తణుకు టౌన్: తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో 'పరిశోధనను పేటెంట్‌గా మార్చడం' అనే అంశంపై జాతీయస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. గీతం యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.శివరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, వివిధ యూనివర్సిటీల డీన్‌లు, ప్రొఫెసర్లు హాజరవుతారని చెప్పారు.

హ్యాండ్‌బాల్ విజేతకు అభినందనలు



సౌజన్యను అభినందిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): గతనెలలో వారణాసిలో జరిగిన జాతీయ మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో టీం కెప్టెన్‌గా ఏలూరు జిల్లాకు చెందిన టి.సౌజన్య ప్రథమ స్థానంలో నిలిచింది. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి తాను పొందిన ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లను చూపించారు. ఆమెను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సౌజన్య పెదవేగి మండలం విజయరాయి–2 పంచాయతీ సెక్రటరీ గ్రేడ్–5గా పనిచేస్తున్నారు. ఆమె గత ఫిబ్రవరిలో ఏలూరులో జరిగిన 8వ సీనియర్ మహిళల హ్యాండ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ పాల్గొన్నారు.

రూపాయికే ఇల్లు.. సంతోషాలు శోభిల్లు



- టిడ్కో లబ్ధిదారుల ఆనందోత్సాహాలు
- 300 చదరపు అడుగుల ఫ్లాట్లను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం
- ఫేజ్–1లో 1,152 ఇళ్లు అందజేత
- పేదల సొంతింటి కల సాకారం

300 చ.అడుగుల ఫ్లాట్లు

పట్టణం	నిర్మాణం	ఇప్పటివరకూ అందజేత
భీమవరం	3,424	512
పాలకొల్లు	2,208	608
తాడేపల్లిగూడెం	1312	32

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ పేదల సొంతింటి కల సాకారమవుతోంది.. ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో ఉంటున్న వారికి సొంత గూడు సమకూరుతోంది. ప్రభుత్వం రూపాయికే ఇల్లు అందించడంతో ఆనందంగా గృహప్రవేశాలు చేసుకుని సంతోషంగా జీవిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లోని 300 చదరపు అడుగుల ఫ్లాట్లను లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తామన్న హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా మొదటి విడతగా జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెంలో గత డిసెంబర్‌లో ఉచితంగా టిడ్కో ఫ్లాట్లను అందించారు. సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల విలువైన ఆస్తిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి మరీ అప్పగించారు. ఇలా జిల్లాలోని మూడు పట్టణాల్లో 1,152 మంది లబ్ధిదారులు ఇళ్లలో ప్రవేశించి నాలుగు నెలలుగా సంతోషంగా జీవిస్తున్నారు.

సర్వత్రా హర్షం : ఉచితంగా ఇళ్లు అందించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ అద్దె ఇంటి కష్టాలు తొలగిపోయాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లాట్‌లు అప్పగించడంతో పాటు టిడ్కో సముదాయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అంటున్నారు. తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్ల నిర్మాణంతో టిడ్కో సముదాయాలు సుందరంగా తీర్చిదిద్దారని అంటున్నారు. అలాగే టిడ్కో ఇళ్లకు వలంటీర్లను కేటాయించి తమకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెబుతున్నారు.

వృద్ధులకు ఆసరాగా..

దాదాపు 30 ఏళ్లకుపైగా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్న వృద్ధులు సొంతిల్లు సమకూరడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చివరి మజిలీలో సీఎం జగన్ దయతో సొంతి ఇంటికి చేరుకున్నామని అంటున్నారు. జీవితంలో సొంతిల్లు వస్తుందనే ఆశ లేని వారికి నేనున్నానంటూ.. ఓ మనవడిగా సీఎం జగన్ లక్షల విలువ చేసే ఇల్లును ఉచితంగా అందించారని కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఫేజ్–2లో మరిన్ని ఇళ్లు

జిల్లాలోని పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెంలో 300 చదరపు అడుగుల ఫ్లాట్లు 6,944 నిర్మాణం చేపట్టగా ఫేజ్–1లో 1,152 ఇళ్లను పేదలకు ఉచితంగా అందించారు. ఫ్లాట్‌లో బెడ్‌రూమ్, హాల్, కిచెన్, బాత్‌రూమ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించారు. టిడ్కో సముదాయాల వద్ద ప్రతి వీధిలో 40 అడుగుల సీసీ రోడ్డు నిర్మించారు. ఫేజ్–2లో మరిన్ని ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

సీఎంకు ధన్యవాదాలు



నేను కూలీ పనులతో బతికేదాన్ని. 25 ఏళ్ల పాటు అద్దె ఇంట్లో అవస్థలు పడ్డాను. సీఎం జగన్ నాకు 300 చదరపు అడుగుల ఇంటిని రూపాయికే రిజిస్ట్రేషన్ చేయించి అందించారు. దీంతో నాకు సొంతిల్లు సమకూరింది. చాలా సంతోషంగా సొంతింట్లో ఉంటున్నా. ముఖ్యమంత్రి జగన్‌బాబుకు ధన్యవాదాలు.

– జి.అప్పలకొండ, భీమవరం

అద్దె ఇంటి నుంచి సొంతింటికి..



ప్రభుత్వం మాకు ఉచితంగా టిడ్కో ఇళ్లు అందించడంతో అద్దె ఇంటి నుంచి సొంతింటికి చేరుకున్నాం. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డాం. నెలకు రూ.4 వేల వరకు అద్దె చెల్లించాల్సి ఉండేది. ఈ నేపథ్యంలో సీఎం జగన్ 300 చదరపు అడుగుల ఫ్లాట్‌ను ఉచితంగా అందించి మమ్మల్ని ఆదుకున్నారు. ఆనందంగా కొత్తింట్లో నివసిస్తున్నాం.

– సీహెచ్ కీర్తి, భీమవరం

వృద్ధాప్యంలో అండగా..



భీమవరానికి చెందిన నామన రామలక్ష్మి దంపతులు దాదాపు 30 ఏళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నారు. నెలకు రూ.4 వేల వరకూ అద్దె చెల్లించేందుకు చాలా ఇబ్బందులు పడేవారు. సొంతిల్లు వారి ఏళ్ల నాటి కల. ఇన్నేళ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా వారి కల సాకారమైంది. భీమవరం టిడ్కో సముదాయంలో 300 చదరపు అడుగుల ఫ్లాట్‌ను రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి వారికి అందించడంతో సంతోషంగా గృహప్రవేశం చేశారు. వృద్ధాప్యంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ దంపతులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు

జేసీ రామసుందర్‌రెడ్డి



సాక్షి, భీమవరం: జిల్లాలో దాళ్వా ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సంచుల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. జిల్లాలో 6.40 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా 270 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాల్సి ఉందని, ఇప్పటికే 144 కేంద్రాలు ప్రారంభించామన్నారు. బాయిల్డ్ రైస్ కొనుగోలుకు అనుమతించినందున చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటర్ల జాబితా క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. స్పందన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. డీఆర్వో కె.కృష్ణవేణి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, భీమవరం ఆర్డీఓ దాసిరాజు, సివిల్ సప్లయిస్ డీఎం టి.శివరామ్ ప్రసాద్, డీఎస్ఓ ఎస్.సరోజ, జిల్లా వ్యవసాయశాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి రవికుమార్, ఉద్యాన అధికారి ఎ.దుర్గేష్, జిల్లా సర్వే అధికారి జాషువా పాల్గొన్నారు.

జాతీయ పౌర సేవల దినోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజలకు సేవకులం అనే భావన ప్రభుత్వ సర్వీసులో ఉన్న ప్రతిఒక్కరూ కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో 16వ జాతీయ పౌర సేవలు దినోత్సవానికి ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ ఎం. సూర్యతేజ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. డీఆర్వో కె.కృష్ణవేణి మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాల ద్వారా మాత్రమే స్వాతంత్ర్య భారతదేశాన్ని సాధించుకోగలిగామన్నారు. కలెక్టరేట్ ఏఓ వై.దుర్గాకిషోర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

ఏలూరు (టూటౌన్): కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. వచ్చే నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వాహన ప్రమాద కేసుల పరిష్కారం నిమిత్తం శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, బీమా కంపెనీల అధికారులు, పిటిషనర్ న్యాయవాదులుతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నందు ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామని, వీటిలో పాల్గొని కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. వాహన ప్రమాద కేసుల ఫ్రీ సిట్టింగ్స్‌ను పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి నిర్వహిస్తారన్నారు. మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను రద్దు చేస్తామని చెప్పే దమ్ముందా!

ప్రతిపక్షాలకు ఎంపీ బోస్ సవాల్



దొడ్డిపట్లలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సుభాష్‌చంద్ర బోస్, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



ములపర్రు పితానివారిపాలెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ బోస్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

యలమంచిలి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలను రద్దు చేస్తామని ప్రకటించి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఎన్నికలకు రావాలని.. పథకాలను కొనసాగిస్తామని తాము ఎన్నికలకు వస్తామని, ప్రజలు ఎవరికి పట్టం కడతారో తేల్చుకుందామని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సవాల్ విసిరారు. మండలంలోని దొడ్డిపట్లలో శుక్రవారం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వశిష్ఠా గోదావరి ఏటిగట్టు దిగువున ఉన్న మత్స్యకార కాలనీ, సంత మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య, సంక్షేమ రంగాల కోసం ప్రభుత్వం రూ.లక్షల కోట్లు వెచ్చిస్తోందన్నారు. కరోనా సమయంలోనూ ప్రజలకు అండగా నిలిచిందన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు అభివృద్ధి చేస్తుంటే పప్పు బెల్లాల్లా డబ్బులు పంచుతున్నారని చంద్రబాబు విమర్శలు చేయడం తగదన్నారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను నూరు శాతం అమలుచేయడం వల్లే పార్టీకి ప్రజల్లో విశేష ఆదరణ ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్న రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, ఎంపీపీ రావూరి వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహరావు, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట

పెనుగొండ: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం రూ.1.25 లక్షల కోట్లు ఖర్చు చేసిందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ములపర్రు శివారు పితానివారిపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు, ప్రతిపక్ష నాయకులు కేవలం నిందలు వేయాలన్న ఉద్దేశంతోనే ఆరోపణలు చేస్తున్నారని, దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ములపర్రు పితానివారిపాలెంలో పేదలకు త్వరలోనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. మంత్రి పితాని సత్యనారాయణ వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ, ఎంపీపీలు పుతినీడి పెద్ద, కర్రి వాసు, జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, సర్పంచ్ మర్రే రాజేశ్వరి, కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా అరుణ నాయకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంపీ బోస్, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, నాయకులు పాల్గొన్నారు.

● రంజాన్ కాంతులు



పవిత్రత, త్యాగం, సోదరభావానికి ప్రతీకగా నిలిచే రంజాన్ వేడుకలకు మసీదులు ముస్తాబయ్యాయి. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా ఏలూరులో కాంతులీనుతున్న గన్‌బజార్ మసీదు దృశ్యమిది.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)

దోపిడీని అడ్డుకోబోతే ప్రాణాలే పోయాయి

- అమెరికాలో దుండగుడి కాల్పుల్లో తెలుగు విద్యార్థి మృతి
- ఏలూరు, పాలకొల్లులో విషాదఛాయలు
- మృతదేహాన్ని త్వరగా తీసుకొచ్చేందుకు కలెక్టర్ యత్నాలు
- బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ఆళ్ల నాని హామీ



మృతుడి తల్లిని ఓదారుస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



వీర సాయిష్ (ఫైల్)

ఏలూరు టౌన్: భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో అమెరికా ఒహాయోలో ఎంఎస్ చదివేందుకు వెళ్లిన ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన వీర సాయిష్ (24) దుండగుడి కాల్పుల్లో మృతిచెందాడు. తాను పనిచేస్తున్న గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో దుండగుడు దోపిడీకి యత్నిస్తుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించి హతమయ్యాడు. తీవ్ర గాయాలపాలైన సాయిష్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. దీంతో ఏలూరుతో పాటు, మృతుని స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో విషాదఛాయలు అలముకున్నాయి.

తండ్రి ఆకాంక్ష నెరవేర్చాలని..

సాయిష్ చిన్నతనం నుంచి ఏలూరులోనే చదువుకున్నాడు. తండ్రి వీర వెంకటరమణ సీఆర్ఆర్ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. తల్లి జయశ్రీ గృహిణి కాగా పెద్ద కుమారుడు వీర వెంకటేష్ అమరావతిలోని కాలేజియేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సాయిష్ ఏలూరులో బీటెక్ పూర్తిచేసి తండ్రి ఆకాంక్ష మేరకు ఎంఎస్ చదివేందుకు కెనరా బ్యాంకులో రూ.30 లక్షల విద్యా రుణం తీసుకుని 2020లో అమెరికా వెళ్లాడు. అక్కడి క్లీన్ లాండ్ యూనివర్సిటీలో చదువుతున్నాడు.

పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్న చోటే..

సాయిష్ చదువుకుంటూనే మరోవైపు పార్ట్‌టైమ్‌గా గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి 12.50 గంటల సమయంలో గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లోకి ఒక దుండగుడు చొరబడ్డాడు. కౌంటర్‌లోని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. విధుల్లో ఉన్న సాయిష్ నిరాకరించాడు. అలాగే పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు అలారం బటన్ నొక్కేందుకు ప్రయత్నించగా దుండగుడు కాల్పులు జరిపాడు. దీంతో సాయిష్‌కు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోయింది.

అండగా ఉంటాం: ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఎమ్మెల్యే ఆళ్ల నాని శుక్రవారం ఏలూరు అశోక్‌నగర్‌లోని మృతుని ఇంటికి వెళ్లి మృతుడి తల్లి, సోదరుడు, బంధువులను పరామర్శించారు. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఘటన వివరాలు తెలుసుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. మృతుని కుటుంబానికి సహకారంగా ఉండాలని ఆర్డీఓ పెంచల కిషోర్, తహసీల్దార్ సోమశేఖర్‌కు సూచించారు. మరోవైపు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సైతం ఢిల్లీలోని ఆంధ్రాభవన్, అమెరికాలోని ఎంబసీ అధికారులతో మాట్లాడుతూ విద్యార్థి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

విశాఖలో చింతలపూడి వాసి మృతి



రైలులో మృతి చెందిన వ్యక్తి మృతదేహం

చింతలపూడి : చింతలపూడి పట్టణానికి చెందిన వ్యక్తి వివరాల కోసం విశాఖ రైల్వే పోలీసులు స్థానిక పోలీసులకు శుక్రవారం సమాచారం అందించారు. ఎస్ఐ డి.హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 17న 55 సంవత్సరాల వయసున్న వ్యక్తి కదులుతున్న రైలు కోచ్‌లో పడిపోవడంతో తలకు బలమైన గాయాలైనట్లు ప్రయాణికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. డ్యూటీలో ఉన్న రైల్వే డాక్టర్ వచ్చి పరీక్షించగా అప్పటికే సదరు వ్యక్తి చనిపోయినట్లు నిర్ధారించారని చెప్పారు. పోలీసులు మృతుడి వ్రేలిముద్రల ఆధారంగా ఏలూరు జిల్లా , చింతలపూడి మండలం, మారుతీనగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి తమకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. విశాఖ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు విచారణ జరపగా ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే విశాఖపట్నం జీఆర్‌పీఎస్ పోలీస్ స్టేషన్ 9666122722 నెంబర్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు షిర్డీసాయిలో కెరీర్ గైడెన్స్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం కెరీర్ గైడెన్స్ ఇవ్వనున్నట్లు రాజమహేంద్రవరం శ్రీ షిర్డి సాయి విద్యా సంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య శుక్రవారం తెలిపారు. దివాన్ చెరువులోని బీజాపురి క్యాంపస్‌లో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతి తరువాత ఏ కోర్సు చదవాలి, దాని వలన ప్రయోజనాలేమిటి, ఉన్నత విద్యకు ఆ కోర్సులు ఏవిధంగా ఉపయోగపడతాయి వంటి అనేక సందేహాలను నిపుణులు నివృత్తి చేయనున్నారన్నారు. అనంతరం ఇంటర్మీడియెట్‌లో ఐఐటీ ఓరియంటేషన్ కోర్సుకు ఎల్‌శాట్, మెడికల్ ఓరియంటేషన్ కోర్సుకు ఎంశాట్, సివిల్స్, క్లాట్ ఓరియంటేషన్ కోర్సుకు డీశాట్ విభాగాలుగా ప్రవేశ పరీక్ష నిర్వహించి, అర్హులైన వారందరికీ స్కాలర్‌షిప్ అందించనున్నామని తెలిపారు. వివరాలకు 95812 61119 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆశలన్నీ.. అక్షయ తృతీయపైనే

- గత నెల రోజులుగా పసిడి అమ్మకాలు ఢీలా
- అక్షయ తృతీయ సెంటిమెంట్‌పై వ్యాపారుల నమ్మకం



నరసాపురం: పసిడి ధరలు మిడిసి పడుతున్నాయి. నెల రోజుల నుంచి బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. దీంతో కొనుగోలుదారులే కాకుంగా బులియన్ వర్తకులు కూడా ఆందోళన చెందుతున్నారు. ధరలు ఆకాశాన్ని తాకుతున్న సమయంలో శనివారం అక్షయ తృతీయ పర్వదినం వచ్చింది. దీంతో వ్యాపారులు అమ్మకాలపై నమ్మకం పెట్టుకున్నారు. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సరికి నరసాపురం బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ 61,150, 916 క్యారెట్ల బంగారం 56,050గా ట్రేడయ్యింది. కాసు వస్తువు కొనాలంటే తరుగు, మజూరీతో లెక్కతో దగ్గరగా రూ.50 వేలు ఖర్చుపెట్టాల్సిందే. దీంతో ఈ అక్షయ తృతీయ అమ్మకాలు ఎలా సాగుతాయనే విషయంలో బులియన్ వర్గాల్లో సందిగ్ధత నెలకొంది. సెంటిమెంట్‌తో ఎంతోకొంత బంగారం కొనడానికి మొగ్గు చూపుతారని.. వచ్చేనెల నుంచి పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండడంతో ఈ ఏడాది అక్షయతృతీయ అమ్మకాలు బాగుంటాయని ఆశతో ఉన్నారు.

నెలరోజులుగా అమ్మకాలు డౌన్

గత నెలరోజుల నుంచి బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో ఉమ్మడి పశ్చిమలో బంగారం షాపులు కొనుగోళ్లు లేక వెలవెలబోతున్నాయి. మరోవైపు పండుగలు లేవు. ప్రస్తుతం మూఢం నడుస్తుండటంతో పెళ్లిళ్లు జరగడంలేదు. దీంతో అసలు జ్యూయలరీ షాపుల వైపు చూసే పరిస్థితి లేదన్నట్టుగా తయారైంది. ఉమ్మడి పశ్చిమలో రోజుకు రూ.3 కోట్ల వరకూ అమ్మకాలు తగ్గాయి. పెళ్లిళ్ల వంటి వాటికి బంగారం కొందామనుకున్న వారు అక్షయ తృతీయ రోజు కొందామని వాయిదా వేసుకుంటూ వచ్చారు. దీంతో గత నెల రోజులగా బంగారం మార్కెట్ డల్‌గా నడిచింది.

అక్షయ తృతీయ ఉత్తర భారతదేశంలో ప్రసిద్ధమైన పండుగ. కొన్ని సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. అక్షయ తృతీయరోజు బంగారం కొనుగోలు చేస్తే ఇల్లంతా స్వర్ణ శోభితం అవుతుందని, మరింతగా బంగారం కొనుగోలు చేసే అవకాశం వరిస్తుందని ఓ నమ్మకం. అక్షయం అంటే నాశనం కానిదని అర్థం. అక్షయ తృతీయ అంటే నాశనం కాకుండా వర్ధిల్లేదని నమ్మకం. లక్ష్మీదేవిని విష్ణుమూర్తి పెళ్లి చేసుకున్న రోజు. కుబేరుడిని ధనానికి అధిపతిగా నియమించిన రోజు ఇదేనని పురాణాల గాథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. దీంతో అక్షయ తృతీయ రోజు పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఈ రోజున కనీసం గ్రాము అయినా కొనాలని ప్రయత్నం చేస్తారు. జ్యూయలరీ షాపులు కూడా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తుంటాయి. శనివారం అక్షయ తృతీయ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని పట్టణాల్లో ప్రధాన జ్యూయలరీ షాపులను ముస్తాబు చేశారు. కొన్ని పట్టణాల్లో తరుగు, మజూరీలో డిస్కౌంట్స్ ప్రకటించి ఆకర్షిస్తున్నారు.

ఈ ఏడాది అమ్మకాలు బాగుంటాయి



గత మూడేళ్ల నుంచి కరోనా కారణంగా అక్షయ తృతీయరోజు అమ్మకాలు సాగలేదు. గత ఏడాది కరోనా ఎఫెక్ట్ లేనప్పటికీ అమ్మకాలు గతంట పోలిస్తే పెద్దగా సాగలేదు. కానీ ఈ ఏడాది అమ్మకాలు బాగుంటాయిని అనుకుంటున్నాము. ధరలు పెరుగుదల కలవరపెడుతుంది. అయితే పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కాబోతుండటం అమ్మకాలు బాగుంటాయని అనుకుంటున్నాము. అక్షయతృతీయరోజు ఎంతోకొంత బంగారం కొనాలన్న సెంటిమెంట్ ఉంది.

పాలూరి బాబ్జి, జ్యూయలరీ షాపు యజమాని, నరసాపురం

రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారుల దాడులు



చింతలపూడి శ్రీ శ్రీనివాస సాయి రైస్ అండ్ ఫ్లోర్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలోని శ్రీ శ్రీనివాస సాయి రైస్ అండ్ ఫ్లోర్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ ఆధ్వర్యంలో మిల్లులో తనిఖీలు చేశారు. తనిఖీల్లో 35 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మిల్లు యజమాని కొండలరావుపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆటోల్లో తీసుకు వచ్చి రైస్ మిల్లులో దిగుమతి చేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అధిక ధరలకు అమ్మే వ్యాపారుల వివరాలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ యుజె విల్సన్, ఎస్ఐ కె.నాగరాజు, ఏఎస్ఓ లక్ష్మణ్ బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం

ఈనెల 30 నుంచి ఉత్సవాలు మొదలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఏర్పాట్లు చురుగ్గా ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7 వరకు జరగనున్న చినవెంకన్న తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మే 4న రాత్రి స్వామివారి కల్యాణం, 5న రాత్రి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రారంభమైన ఏర్పాట్లలో భాగంగా ఆలయ పరిసరాలు, దర్శనం క్యూలైన్లను సిబ్బంది రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద తాటాకు పందిరిని నిర్మించారు. గుడిసెంటర్‌లోని ఆలయ ప్రధాన కూడలిలో 40 అడుగుల శ్రీవారి భారీ విద్యుత్ కటౌట్‌ను నిర్మిస్తున్నారు. మరో రెండు రోజుల్లో విద్యుద్దీప అలంకారాలు, ఇతర పనులు ప్రారంభం కానున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కోరారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద నిర్మించిన తాటాకు పందిరి



దర్శనం క్యూలైన్లకు రంగులు వేస్తున్న సిబ్బంది



ముస్తాబవుతున్న శ్రీవారి వాహనాలు

కొబ్బరి చెట్టు ఎక్కే యంత్రానికి పేటెంట్

ఉద్యాన వర్సిటీ విద్యార్థి ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం: కొబ్బరిచెట్లు ఎక్కడానికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధనా విద్యార్థి రూపొందించిన పరికరానికి పేటెంట్ దక్కింది. చెట్ల కాండానికి నష్టం కలిగించకుండా కొబ్బరి చెట్లు ఎక్కవచ్చు.

ఆవిష్కరణ జరిగింది ఇలా..

20 నుంచి 30 మీటర్లు ఎత్తు పెరిగే కొబ్బరి చెట్లు ఎక్కడం అంత సులువు కాదు. కొబ్బరి తోటల్లో వందలాది చెట్లు ఎక్కి మోకు సాయంతో కాయలు తీయడం చాలా కష్టం. కొన్ని కొన్ని సందర్భాలలో ప్రమాదాలు జరగడంతో పాటు కార్మికులు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ పరిస్తితిని అధిగమించడానికి కొబ్బరి చెట్ల స్వర్గం కేరళను ఆదర్శంగా తీసుకొని చెట్లు ఎక్కే పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. కేవీకే మార్గదర్శనంలో వీటి వినియోగంపై శిక్షణా తరగతులు జరిగాయి. ఉద్యాన వర్సిటీ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ డీవీ స్వామి, డాక్టర్ పి.అశోక్‌ల మార్గదర్శనంలో వర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి డాక్టర్ మేరుగు చంద్ర సూర్యారావు ఎలాంటి ప్రమాదం లేకుండా కొబ్బరి చెట్లు ఎక్కే యంత్రం తయారు చేశారు.

చెట్టుకు నష్టం లేకుండా

కొబ్బరి చెట్టుకు ఏ విధమైన నష్టం కలుగకుండా ఎక్కడానికి వీలుగా ఉండే యంత్రానికి రూపకల్పన చేశారు. ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ ప్రోత్సాహంతో భారత ప్రభుత్వ పేటెంట్ డిజైన్‌కు పంపించగా ఆమోదం లభించింది. ఈ మేరకు పేటెంట్ హక్కులు నిర్ధారిస్తూ జారీ చేసిన సర్టిఫికెట్‌ను వీసీ జానకీరామ్ ఆవిష్కర్త చంద్ర సూర్యారావుకు శుక్రవారం అందచేశారు. ఈ పరికరం అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు ఎంతో మేలుకలుగుతుందని వీసీ అన్నారు. రైతులకు,కొబ్బరి తీత కార్మికులకు కొబ్బరి చెట్లు ఎక్కేటప్పుడు భద్రత లభిస్తుందన్నారు.



పేటెంట్ పత్రాన్ని రూపకర్త మేరుగు చంద్రసూర్యారావుకు అందచేస్తున్న వర్సిటీ వీసీ టి.జానకీరామ్. చిత్రంలో సీనియర్ సైంటిస్టు డీవీ స్వామి

నాటు సారా విక్రేత అరెస్ట్

ద్వారకాతిరుమల : మండలంలోని దొరసానిపాడులో నాటు సారా విక్రయిస్తున్న ఒక మహిళను శుక్రవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచినట్టు ఎస్ఈబీ(భీమడోలు) ఎస్సై ఏయూబీ సుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామానికి చెందిన జంపాల లక్ష్మి నాటు సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం ఆమెను భీమడోలు కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. నాటుసారా, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలను దొరసానిపాడు గ్రామ సచివాలయం వద్ద ప్రజలకు వివరించినట్లు ఆయన పేర్కొన్నారు.

టిప్పర్లు, జేసీబీలు సీజ్

జంగారెడ్డిగూడెం : అనుమతి లేకుండా కేకేఎం ఎర్రకాలువ జలాశయం నుంచి మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న ఘటనలో మూడు టిప్పర్లు, రెండు జేసీబీలను ఎస్సై ఎం.సాగర్‌బాబు సీజ్ చేశారు. ఎర్రకాలువ జలాశయం నుంచి మట్టి అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం రాత్రి దాడి చేసి 3 టిప్పర్లు, 2 జేసీబీలను సీజ్ చేసినట్లు తెలిపారు. సమాచారాన్ని శుక్రవారం తహసీల్దార్‌కు లేఖ ద్వారా తెలియజేయగా 3 టిప్పర్లకు రూ.30వేలు, 2 జేసీబీలకు రూ.40వేలు జరిమానా విధించారు.

వీఆర్ఓలపై ఒత్తిడి వద్దు

ఏలూరు(మెట్రో): ప్రస్తుతం రెవెన్యూలో జరుగుతున్న పనుల విషయంలో వీఆర్ఓలపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూతిరాజు రవీంద్రరాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వీఆర్ఓలపై ఒత్తిడి తీసుకురావడం పట్ల తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని, దీని వల్ల మరణాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. రీసర్వే పక్కాగా జరగాలంటే రైతుల సహకారం ఉండాలన్నారు. కంగారుగా చేసి తప్పులు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు, అధికారులకు చెడ్డపేరు వస్తుందన్నారు.

చీటింగ్ కేసులో ఏడాది జైలు శిక్ష

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ముత్యాల దుర్గారావుకు ఉద్యోగం, అంగవైకల్య ధృవపత్రం, బ్యాంక్ లోను ఇప్పిస్తానని చెప్పి మోసగించిన సీపాని నాగ పెద్దిరాజుకు భీమవరం కోర్టు మెజిస్ట్రేట్ ఏ.పవన్ కుమార్ ఏడాది జైలు శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పినట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి తెలిపారు. 2015లో దుర్గారావు వద్ద దఫ దఫాలుగా రూ. 3,50,000లు తీసుకుని మోసగించినట్లు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై కే.అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీటు దాఖలు చేశారు. కేసు వాదోపవాదాల అనంతరం తీర్పునిచ్చినట్లు ఎస్ఐ వివరించారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికుడు వడదెబ్బకు గురై మృతిచెందినట్లు పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టులో ఎత్తిపోతల పథకం పనుల్లో సబ్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్న లలన్ ఘోష్ (38) పోలవరం వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. పనులు ముగించుకుని, మకాం వద్దకు వెళ్లి స్నానం చేస్తుండగా స్పృహ తప్పి పడిపోయినట్లు తెలిపారు. అదే ప్రదేశంలో ఉన్న అతని సోదరుడు ప్రవాకర్ ఘోష్ , మరికొంతమంది సహాయంతో లలన్ ఘోష్‌ను పోలవరం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

బైక్ చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

జంగారెడ్డిగూడెం: మోటార్‌సైకిల్ చోరీ కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. రాజమండ్రికి చెందిన గుండుబోయిన సాయి అచ్యుత్ ఈ నెల 3వ తేదీన జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద కేటీఎం డ్యూక్ బైక్‌ను పార్క్ చేసి, టీ తాగి వచ్చి చూడగా మోటార్‌సైకిల్ కనిపించలేదన్నారు. అప్పటి నుంచి వెతికినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 19న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. శుక్రవారం ఏలూరు తంగెళ్లమూడికి చెందిన దత్తి నవీన్ నూకాలమ్మ గుడి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా, అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. మోటార్‌సైకిల్ తానే దొంగిలించినట్లు నవీన్ అంగీకరించాడన్నారు.

నేటి నుంచి పరశురామ ప్రతిష్ఠ

పెనుమంట్ర: త్రిలింగ క్షేత్రంగా ప్రఖ్యాతగాంచిన పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలో గోస్తనీ గర్భంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరుడు నేటి నుంచి భక్తులకు నిజరూప దర్శనం ఇవ్వనున్నారు. ఈ క్షేత్రంలో నది ఒడ్డున ఉన్న శ్రీరామేశ్వరస్వామి(నత్తల లింగం) సీతారాములు ప్రతిష్ఠి కాగా, ఆవలి ఒడ్డున ఉన్న శ్రీలక్ష్మణేశ్వరలింగం లక్ష్మణస్వామి ప్రతిష్ఠించారని చెబుతారు. నదీ గర్భంలో ఉన్న శ్రీ పరశురామ ప్రతిష్ఠగా శ్రీరామలింగేశ్వరస్వామి ఏటా వైశాఖ మాసంలో మాత్రమే భక్తులకు దర్శనమిస్తుంటారు. మిగిలిన 11 నెలలు స్వామి జలధివాసంలోనే ఉంటారు. ఈనెల 22 తేదీ నుంచి మే 19 వరకు వైశాఖ మాసం పురస్కరించుకుని భక్తులు దర్శించుకునేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేయడమే కాకుండా పర్వదినాల్లో దూర ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసారు. వైశాఖమాసం అంతా నిత్య దర్శనంతో పాటు ఈనెల 24, మే 1, 8, 15 తేదీలలో వచ్చే సోమవారాలు, మే 5 వైశాఖ పౌర్ణమి, 14 హనుమాన్ జయంతి, 18 మాస శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు జరుగుతాయని తెలిపారు.





నత్తారామేశ్వరం త్రిలింగ క్షేత్రం శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయం, శ్రీరామేశ్వరస్వామి (ఇన్‌సెట్‌లో)

గడపగడపకు సంక్షేమం



పాలకోడేరు : మండలంలోని కుముదవల్లిలో గడపగడపకు మన ప్రభుత్వంలో బ్రోచర్లను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

కేజీబీవీల్లో ప్రవేశాలకు గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలకు ఈ నెల 30 వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు, వేలేరుల్లో ఉన్న కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో బాలికల ప్రవేశానికి, 7,8,9 తరగతుల్లో మిగిలిఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 30 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. డ్రాపవుట్ బాలికలు, బడి బయటి పిల్లలు, అనాథలు, పాక్షిక అనాథలు, పీహెచ్‌సీలు, ఎస్‌సీ, ఎస్‌టీ, మైనార్టీలు, తల్లిదండ్రులు వలస వెళ్ళిన బాలికలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏపీకేజీబీవీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ పంపుతారని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు కేజీబీవీ ప్రత్యేక అధికారులను 94419 15166, 83741 72109, 89199 84331 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

దూరవిద్య ప్రాక్టికల్స్‌కు 414 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రయోగ పరీక్షల్లో శుక్రవారం 414 మంది హాజరయ్యారు. భౌతిక శాస్త్రం పరీక్షకు 155 మందికి గాను 131 మంది హాజరయ్యారు. రసాయన శాస్త్రం పరీక్షకు 149 మందికి 124 మంది హాజరయ్యారు. జీవ శాస్త్రం పరీక్షకు 181 మందికి 159 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం టూటౌన్ పరిధిలోని దుర్గాపురంలో చెట్టుకు ఉరివేసుకుని ఊబ మహేష్(29) మృతిచెందినట్లు ఎస్సై వి.రాంబాబు చెప్పారు. మహేష్‌కు అదేప్రాంతానికి చెందిన యువతితో ఏడేళ్లక్రితం వివాహమైంది. కొంతకాలంగా అధికంగా మద్యం సేవిస్తూ భార్యకు దూరంగా ఉంటున్నాడు. పది రోజుల క్రితం చనిపోతానంటూ బైపాస్ రోడ్డు వద్ద యనమదుర్రు డ్రెయిన్‌లో దూకేందుకు ప్రయత్నించగా కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. గురువారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లిన మహేష్ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం, తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబు చెప్పారు.

నా భార్యది ఆత్మహత్య కాదు

దెందులూరు: తన భార్యది ఆత్మహత్య కాదని, ఈ సంఘటనలో వాస్తవాలు వెలుగులోకి రావాలని చల్లచింతలపూడి గ్రామ కార్యదర్శి భావిశెట్టి వాసు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దెందులూరుకు చెందిన సుకన్యతో గతేడాది వివాహమైందని, పెళ్లి సమయంలో ఎలాంటి కట్నకానుకలు తీసుకోలేదన్నారు. ఇద్దరికీ మనస్పర్ధలు రావడంతో పెళ్లయిన మూడు నెలల తరువాత నుంచి వేరుగా ఉంటున్నామన్నారు. ఎన్నో నెలలుగా భార్యతో విడివిడిగా ఉంటున్నప్పుడు ఆమె మృతికి తాను ఎలా కారణమవుతానని ప్రశ్నించారు. చనిపోయే సమయానికి తన భార్య చేతి, మెడ భాగాల్లో గాయాలు ఉన్నాయని చెప్పారు. తన కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని తన అత్త పోలీసులకు వాంగ్మూలం ఇచ్చిందన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న గ్రామ సర్పంచ్ ఎలిపే గాంధీ, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రావుపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ ఎలిపే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, ఉపాధి కూలీలు ఉన్నారు.

లౌకికతత్వాన్ని దెబ్బతీస్తున్న బీజేపీని సాగనంపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, దేశ లౌకికతత్వాన్ని దెబ్బ తీస్తూ అట్టడుగు వర్గాల వారిపై దాడులు చేస్తున్న బీజేపీని సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిగురుపాటి బాబురావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, నాయకులు చింతకాయల బాబూరావు, నెక్కంటి సుబ్బారావు, దూసనపూడి సోమసుందర్, కె.వెంకట్రావు, జేఎన్వీ గోపాలన్, కె.రాజారామోహన్‌రాయ్, కళ్యాణి, కర్రి నాగేశ్వరరావు, మండల నాగేశ్వరరావు, సీతారాం ప్రసాద్, కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ లోక్ ఆదాలత్‌ను తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో మే 13వ శనివారం కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు వెల్లడించారు. రాజీ పడదగిన అన్ని కేసులను కక్షిదారులు సులువుగా రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. బ్యాంక్ కేసులు, చెక్కు కేసులు, ఆస్తుల పంపకాలు, తదితర అన్ని కేసులను పరిష్కరించుకోవచ్చునని వెల్లడించారు. న్యాయవాదులు, పోలీసులు, ఆయా శాఖల అధికారులు కేసులను రాజీ చేసేందుకు కక్షిదారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ చీరకు పావు కిలో వెండి వితరణ



శ్రీముత్యాలమ్మవారి చీరకు వెండిని బహూకరిస్తున్న జంగా శ్రీనివాస రామ్‌రాయ్ దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మ చీర నిమిత్తం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన జంగా శ్రీనివాస రామ్‌రాయ్ – కుముదిని దంపతులు పావు కిలో వెండిని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరామప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ పై శిక్షణ

కాళ్ల: ప్రభుత్వం అందించే శిక్షణను తీసుకుని ప్రధానోపాధ్యాయులు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్(ఎపిసి) పి.శ్యాంసుందర్ అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు సోషల్ ఆడిట్ మూల్యాంకనంపై ఒకరోజు శిక్షణా కార్యమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి అమ్మవార్ల జాతర

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవతలు మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవ వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 22 శనివారం నుంచి 30వ తేదీ ఆదివారం వరకు అంగరంగ వైభవంగా జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత



అత్తిలి షాదిఖానాలో ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేస్తున్న మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్



పేద ముస్లింలకు పండ్లు, ఖర్జూరం బాక్స్‌లు అందజేస్తున్న పేరిచర్ల మురళీకృష్ణం రాజు

అత్తిలి: రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్ చెప్పారు. శుక్రవారం అత్తిలి షాదీఖానా భవనంలో రంజాన్ సందర్భంగా రాష్ట్రమంత్రి కారుమూరి నాగేశ్వరరావు సొంత నిధులతో సమకూర్చిన రంజాన్ కానుకలను మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్ అందజేశారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో తన తండ్రి కానుకలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, మైనార్టీ కార్పోరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, సర్పంచ్‌గంటా విజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల చినబాబు, కంకటాల సతీష్, కోరుకొల్లు వెంకట్రావు, బుడితి సుజన్‌కుమర్, సబ్బితి రాజేష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అత్తిలి మండలంలోని వైట్ల బ్రాహ్మడు సత్రంలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని కారుమూరి సునీల్ కుమార్ ప్రారంభించారు.

తణుకు టౌన్: ముస్లింల పవిత్రమైన పండుగ రంజాన్ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సొంత నిధులతో నియోజకవర్గంలోని ముస్లిం కుటుంబాలకు రంజాన్ కానుకలను ఆయన కుమారుడు కారుమూరి సునీల్ కుమార్ శుక్రవారం నియోజకవర్గంలోని వివిధ మసీదుల వద్ద పంపిణీ చేశారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు, తేతలి గ్రామాల్లో ముస్లీం కుటుంబాలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మండల పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకటప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, భూపతిరాజు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేల్పూరు బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కారుమూరి సునీల్ కుమార్ ప్రారంభించారు.

హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): హిందూ, ముస్లింలు ఐక్యతకు మారుపేరు తాడేపల్లిగూడెం పట్టణమని, ఐక్యమత్యంగా ఉండాలని పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు అన్నారు. స్థానిక వీకర్స్‌కాలనీలో శుక్రవారం నూర్ ఏ మజీద్‌లో పేరిచర్ల ఫౌండేషన్, డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముస్లిం పేదలకు పండ్లు, ఖర్జూరం బాక్స్‌లు అందించారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు ముజుబుర్ రహమాన్, మాజీ కో ఆప్షన్ సభ్యులు షస్త్రక్‌బాజీ, అస్లాం, న్యాయవాది భాష, సుప్రిజ్‌ఖాన్, పర్వీద్ ఖాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: ముస్లిం సోదరి, సోదరులు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కారుమూరి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలం రేలంగిలో రాష్ట్రమంత్రి కారుమూరి నాగేశ్వరరావు సొంత నిధులతో సమకూర్చిన రంజాన్ కానుకలను మంత్రి తనయుడు కారుమూరి సునీల్ కుమార్ అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేబ్రోలు పెద్దిరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, పులుపు సునీల్, మండల పార్టీ అధ్యక్షుడు కె దుర్గా ప్రసాద్, ఎంపీటీసీలు మహలక్ష్మీ, మెంటరాజు, కిరాణ్మయి, నాయకులు చేబ్రోలు పెద్దిరాజు, మైనం పాము, వడ్డే మార్కేండేయులు, ఫణీ, సీఎస్ ఆర్ఐ పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి



కాకిలేరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బ్రోచర్ అందించి పథకాలు వివరిస్తున్న కారుమూరి సునీల్

ఇరగవరం: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ కుటుంబాన్ని ఆశ్వీరదించాలని కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం 83వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. పేదలకు మేలు చేసే ఈ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకొని వచ్చేందుకు సహకరించాలని కోరారు. గాయపడిన వలంటీర్ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ అలివేలు మంగతాయారు, పార్టీ అధ్యక్షుడు కె దుర్గా ప్రసాద్, జవ్వాది రామోజి, సర్పంచ్ ఉన్నమట్ల నాగమణి, వార్డు నెంబర్ రాజు కిషోర్, రాంబాబు, బాబులు, విఘ్నేశ్వరరావు గ్రామంలోని కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తాం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్

అత్తిలి: రైతుల నుంచి ప్రభుత్వం ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తుందని, వారికి అండగా ఉంటుందని మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్ చెప్పారు. శుక్రవారం అత్తిలి మండలం పాలూరు రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయడానికి రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. దళారులకు అమ్ముకొని మోసపోవద్దని, ప్రతి రైతు రైతుభరోసా కేంద్రాల వద్ద పంటను అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలన్నారు.

అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో 60 వేల టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. మండలంలో మూడు రైసు మిల్లులే ఉండటం వల్ల అదనపు సంచులు ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తామని తహసీల్దార్ ఏపీ రామాంజనేయులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మక్కాసూర్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరిరాజు, సర్పంచ్ తానుకొండ దయామణి, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు కంకటాల సతీష్, ఆకుల చినబాబు, ఆకుల పండుస్వామి, గంటా నాగరాజు, ఎంపీడీవో రామారావు, మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభం





తణుకులో చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పోస్తున్న కారుమూరి సునీల్‌కుమార్, మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న విజయవాడ కనక దుర్గమ్మ గుడి దేవస్థానం డైరెక్టర్ మారం వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: పట్టణంలో తణుకు కోర్టు, మునిసిపల్ కార్యాలయాల ప్రాంతాల్లో కారుమూరి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాలను యువనేత కారుమూరి సునీల్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుమూరి సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. వేసవి సందర్భంగా వడగాల్పులు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తణుకు నియోజకవర్గమంతా ఈ చలివేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వైఎస్సార్ సీపీ తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, ఎస్సీసెల్ తణుకు మండల అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, నత్త కృష్ణవేణి, పాట్ల సురేష్, తాటిపర్తి వాసు, షేక్ బాజీ, కుడుపూడి చంద్రరావు, షేక్ సలీం పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం తాలూకా ఆఫీస్ సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు, విజయవాడ కనకదుర్గమ్మ గుడి దేవస్థానం డైరెక్టర్ మారం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి దాహార్తిని తీర్చే విధంగా ప్రతి సంవత్సరం ఆర్యవైశ్యులు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పలివేల ఏకాంబ్రేశ్వరరావు, మండవల్లి చెన్నా నాగేంద్రరావు, నున్న సుందరరావు, చీమకుర్తి రాజశేఖర్ గుప్తా, పసుమర్తి అనిల్, మండ పవన్ కుమార్, కె.రాము, మానేపల్లి సుబ్రహ్మణ్యం, రాం పండు, వాసవి వనిత క్లబ్ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత



దోమల నివారణ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: కీటక జనిత వ్యాధుల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెంలో వెంకట్రామన్నగూడెం గ్రామంలోనూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ నీటి నిల్వల్లో దోమలు అభివృద్ధి చెందకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు వెంకటలక్ష్మి, లక్ష్మీకళ, సుసన్న, సామాజిక ఆరోగ్య అధికారి కె.పద్మ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): నీటి నిల్వలు దోమలకు నిలయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు.పట్టణంలో 6,7,8 వార్డులో ఫ్రై డే, డ్రై డే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన నిర్వహించారు. జ్వరం వచ్చిన వారు పరీక్షలు చేయించుకొని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు వెంకట లక్ష్మి, కళ, కాంతారావు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్‌లో టెండర్ విధానాన్ని తీసుకురావడం చట్ట వ్యతిరేకం



సీఐటీయూ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ సీడ్స్ తణుకులో 50 సంవత్సరాల నుంచి ఉన్న విధానానికి భిన్నంగా టెండర్ విధానాన్ని తీసుకురావడం చట్ట వ్యతిరేకమని సీఐటీయూ పశ్చిమ గోదావరి జిల్లా నాయకులు తెలిపారు. పట్టణంలో శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, గోపాలన్‌లు మాట్లాడుతూ తణుకు ఏపీ సీడ్స్‌లో అధికార్లు చట్టానికి భిన్నంగా టెండర్ విధానాన్ని తీసుకు వచ్చారని, అనేక సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులను తొలగించి చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తణుకు కార్మికులకు అండగా జిల్లా కార్మికులు నిలవాల్సిన అవసరం ఉందని, ఏప్రిల్ 24, 25 తేదీల్లో మండల కార్యాలయాలు వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, దక్షిణామూర్తి, కార్మిక నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



అత్తిలి మండలం ఎర్రనీలిగుంటలో పంటకోత ప్రయోగం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

అత్తిలి: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయని ప్రకృతి వ్యవసాయం జోనల్ కోఆర్డినేటర్ రత్నాజీ చెప్పారు. అత్తిలి మండలం ఎర్రనీలిగుంట గ్రామంలో శుక్రవారం గూడూరి రాంబాబు వ్యవసాయ క్షేత్రంలో పంటకోత ప్రయోగం జరిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేపట్టిన వరిపంటకు, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం ద్వారా చేపట్టిన వరిపంటకు సంబంధించి వ్యత్యాసాన్ని రైతులకు వివరించారు. పచ్చి రొట్ట ఎరువులు పెంచుకునేందుకు నవధాన్యాలు వేయాలని, దీనివల్ల భూసారం పెరిగి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జీవ వైవిద్యం పెరుగుతుందని, చీడపీడలు తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు అనిశెట్టి త్రిమూర్తులు రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీ గంగాధర్, ఎంటీ మధుసూధన్‌రావు, జి రామకృష్ణ, కుమారి, రైతులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి



కె. పెంటపాడు మసీదులో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న యువనేత కొట్టు విశాల్

పెంటపాడు: ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. రంజాన్ పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం కె. పెంటపాడు మసీదును విశాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లింలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తరపున ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లీం పెద్దలు వర్షాకాలంలో మునిగిపోతున్న మసీదు రోడ్డు, ఇతర సమస్యలను విశాల్ దృష్టికి తెచ్చారు. ముస్లిం మత పెద్దలంతా కలిసి ఉపముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లేలా చూస్తానని, సమస్యలను మంత్రికి వివరిస్తానని ఈ సందర్భంగా విశాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పొట్ల ఏడుకొండలు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



కాకిలేరులో పార్టీలో చేరిన వారితో కారుమూరి సునీల్‌కుమార్

ఇరగవరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఇతర పార్టీల నుంచి వలసలు వస్తున్నరని కారుమూరి సునీల్ కుమార్ తెలిపారు.శుక్రవారం మండలంలోని కాకిలేరు గ్రామంలో రాష్ట్ర పౌర సరఫరాల వినియోగదారుల, వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధ్వర్యంలో జరుగుతున్నా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టీడీపీ,జనసేన పార్టీల నుంచి 30 కార్యకర్తలు వైసీపీలో చేరారు. వారిని పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజిబాబు, యంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, మండల పార్టీ అధ్యక్షుడు కె దుర్గా ప్రసాద్, జవ్వాది రామోజి, సర్పంచ్ ఉన్నమట్ల నాగమణి, వార్డు నెంబర్ రాజు కిషోర్, రాంబాబు, బాబులు, విఘ్నేశ్వరరావు గ్రామంలోని కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



జగనన్న పథకాలు ప్రచారం చేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు తదితరులు

పెంటపాడు: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జగనన్నతోనే సాధ్యమని గూడెం ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ,పెంటపాడు ఎంపీటీ సీ సభ్యులు రెడ్డి సూరి బాబులు పేర్కొన్నారు. పెంటపాడు గ్రామంలో ఇంటింటికి మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో మేదర్ల పేట, 3వ వార్డు, పుంతలో ముసలమ్మ అమ్మవారి వీధి పలు ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను బలపరచి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తమ నాయకుడుగా ఉండాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రవీణ, దాసరి నరేష్, వార్డు సభ్యులు బర్ల జయరాంబాబు, రెడ్డి శ్రీను, పొన్నాడ సత్యనారాయణ తదితరులతో పాటు గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

తాడేపల్లిగూడెం రూరల్: ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొన్న సంఘటన శుక్రవారం ఉదయం వెంకట్రామన్నగూడెం గ్రామం వద్ద జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి శుక్రవారం రూరల్ ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉంగుటూరు మండలం వెల్లమిల్లి గ్రామానికి చెందిన సాతాను నాగలక్ష్మితో పాటు మరో ఆరుగురు వ్యక్తులు మొక్కజొన్నపొత్తుల పని నిమిత్తం తెలికిచర్ల ఆటోలో బయల్దేరారు. ఆటో వెంకట్రామన్నగూడెం వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన లారీ (ఏపీ 16 టీయు 9806) ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్, అందులో ప్రయాణిస్తున్న వారికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు సాతాను నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

అక్కాచెల్లెళ్లను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: వివాహిత, అతని చెల్లిని వేధించిన వ్యక్తిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన వివాహిత పెనుమర్తి జీవిత(22), ఆమె చెల్లి బహిర్భూమికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మెరిపే ఏసు అనే వ్యక్తి అవమానకరంగా మాట్లాడాడు. అంతే కాకుండా వారిపై కర్రతోనూ, టైల్స్ ముక్కతో ఏసు దాడి చేసినట్లు బాధితురాలు శుక్రవారం రూరల్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రూరల్ ఏఎస్సై దుర్గారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సాక్షి, భీమవరం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. భీమవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మాలమహానాడు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. నేడు చదువుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ చదును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతలో మార్పు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పుష్పరాజ్ కోరారు. అనంతరం మాలమహానాడు భీమవరం పట్టణ అధ్యక్షుడిగా చీర సాయికుమార్, జొన్నలగరువు గ్రామ కార్యదర్శులుగా దారం రాజశేఖర్, కాటిక రమేష్ లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేతల సువర్ణ రాజు, కోలాటి ప్రసాదరావు, మానుకొండ కిరణ్, పిట్టా వినోద్ కుమార్, చిగురుపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

